క్లుప్తంగా

నేడు ఎంఎంఎన్ గ్రాండ్ లోగో ఆవిష్కరణ

కాచిగూడ: మీటింగ్ మిలియన్స్ నెట్‌వర్క్ (ఎంఎంఎన్) గ్రాండ్ లోగో ఆవిష్కరణను ఈ నెల 9వ తేదీన బుధవారం సాయంత్రం 6:30 గంటలకు హైటెక్ సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు మడిపడిగె రాజు తెలిపారు. మంగళవారం కాచిగూడలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందం, ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్, వెంకట రవికుమార్, ప్రకాష్, రాము, ఆశురెడ్డి, ఇమ్మడి రమేష్ తదితరులు పాల్గొంటారని సమాచారం.

12న బధిరుల సమస్యలపై సదస్సు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 'డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్' తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దివ్యాంగులు, బధిరుల సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ జాతీయ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి భారతి, ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేష్‌గౌడ్‌లు తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్రంలోని అన్ని సంఘాలు పాల్గొంటాయన్నారు. అనంతరం త్వరలో నిర్వహించబోయే మహాధర్నా పోస్టర్, కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు.

నిధుల మంజూరుకు మంత్రికి వినతి



ఎమ్మెల్యేతో కలిసి మంత్రి తలసానికి వినతిపత్రం అందజేత

కాచిగూడ: కాచిగూడలోని భావసార్ భవన్‌పై అదనపు అంతస్తు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి తలసానికి అశ్విన్‌కుమార్ పతంగే విన్నవించారు. రూ. 25 లక్షల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి భావసార్ క్షత్రియ (రంగ్రేజ్) సమాజ్ ట్రస్టీ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. భావసార్ క్షత్రియ సమాజ్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు సమాచారం.

వర్షపునీటి సంరక్షణపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

ముషీరాబాద్: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నెహ్రూ యువజన కేంద్రం సౌజన్యంతో, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, ఈకోక్లబ్, హరితహారం కమిటీల సంయుక్తాధ్వర్యంలో వర్షపునీటి సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యానగర్ కళాశాల విద్యార్థులతో పాటు క్లస్టర్ కళాశాలలైన ఉప్పల్, సీతాఫల్‌మండి, మల్కాజ్‌గిరి, హయత్‌నగర్ డిగ్రీ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.సుకన్య, నెహ్రూ యువజన కేంద్రం యూత్ ఆఫీసర్ కుష్బూగుప్తా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనితాఅబ్రహం, డాక్టర్ సౌజన్య, డాక్టర్ చిన్నబాబు, షీబారాణి, ఇష్రత్‌సుల్తానా, విశ్వనాథ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కత్తితో మహిళపై దాడి

నల్లకుంట: ఓ మహిళను చాకుతో గాయపరిచి పరారైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గొంతు, చేతులపై గాయాలైన ఆమె స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అడ్మిన్ ఎస్సై శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లిలోని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దుర్గా అనిత(55) కుటుంబసభ్యులతో కలిసి నల్లకుంట టీఆర్టీ కాలనీలో నివసిస్తున్నారు. జహీరాబాద్ ఎన్కేపల్లి ప్రాంతానికి చెందిన దూరపు బంధువు(వరసకు మేనల్లుడు) మల్లికార్జున్ సోమవారం రాత్రి 6.30 గంటల సమయంలో ఆమె ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో భర్త న్యాయవాది సురేష్ పనిపై బయటకు వెళ్లగా.. కూతురు విస్మయ ట్యూషన్‌కు వెళ్లింది. కాగా వంట చేసేందుకు అనిత వంట గదిలోకి వెళ్లగా.. ఆమెను అనుకరించి కత్తితో గాయపరిచాడు. అదే సమయంలో ట్యూషన్ నుంచి వచ్చిన కుమార్తె తల్లి పరిస్థితిని చూసి అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీంతో ఆమెపై కూడా దాడికి యత్నించడంతో తండ్రికి ఫోన్ చేశారు. అతను వెంటనే ఇంటికి చేరుకుని స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారమిచ్చాడు. వారు ఘటనా స్థలికి వెళ్లి వివరాలను సేకరించారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- బీఆర్ఎస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం
- కోట్లాది నిధులతో డివిజన్‌ను అభివృద్ధి చేశామన్న ఎమ్మెల్యే కాలేరు
- నూతన అంబులెన్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



యూపీహెచ్‌సీలో 108, 102 అంబులెన్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కాచిగూడ: కోట్లాది రూపాయల నిధులతో కాచిగూడ డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ప్రతి బస్తీ, కాలనీలో శాశ్వత ప్రాతిపదికన ఇప్పటికే పలు అభివృద్ధి పనులను ప్రారంభించి పూర్తి చేశామన్నారు. మంగళవారం రాత్రి కాచిగూడ లింగంపల్లిలోని కర్ణాటక సాహిత్య మందిర్‌లో బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మ దేవ్ అధ్యక్షతన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలా సమస్య పరిష్కారానికి రూ.62 కోట్లతో శివాజీనగర్, హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతున్నామన్నారు.

- రత్నానగర్ బ్రిడ్జిపైన వర్టికల్ గార్డెన్‌ను నిర్మించి అందంగా తీర్చిదిద్దామన్నారు. నారాయణగూడ చౌరస్తాలో మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నామన్నారు.
- బర్కత్‌పుర పార్కును రూ.1.50 కోట్లతో థీమ్‌పార్కుగా తీర్చిదిద్దామని, త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. డివిజన్‌లోని అన్ని బస్తీల్లో, కాలనీల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు.
- తాగునీటి వసతి, డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపర్చామని పాదయాత్ర ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీ తీసుకురావాలని పార్టీ కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు, బీఆర్ఎస్ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ బద్దుల ఓంప్రకాష్‌యాదవ్, డాక్టర్ శిరీష, కె.సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, సునిల్ బిద్లాన్ తదితరులున్నారు.

అత్యవసర వైద్యసేవలు ప్రజలకు చేరువ..

ముషీరాబాద్: అందరికీ మెరుగైన వైద్యం అందిస్తున్న ప్రభుత్వం అత్యవసర సేవలను మరింత చేరువ చేసేందుకు అధునాతన వాహనాలు 108 అంబులెన్స్, అమ్మబడి 102 వాహనాలు దోహదపడతాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గానికి వైద్య ఆరోగ్యశాఖ కేటాయించిన 108 అంబులెన్స్, అమ్మబడి 102 వాహనాలను ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యారోగ్యశాఖ అధికారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మౌనికలతో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ వైద్య రంగాన్ని మరింత అభివృద్ధి చేసి పేదలకు అండగా నిలిచారన్నారు.

- నియోజకవర్గంలోని ఆరు డివిజన్లకు 108,102 వాహనాలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని సూచించారు. అమ్మబడి వాహనాలు గర్భిణీలు, బాలింతలకు సేవలు అందించేందుకు నిత్యం అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.
- కార్పొరేట్ స్థాయిలో యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానాలలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్‌నాయకుడు టి.సోమన్, ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ 6 డివిజన్‌ల అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, నర్సింగ్‌ప్రసాద్, ఆర్.మోజెస్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌కుమార్, వల్లాల శ్యామ్‌యాదవ్, రాష్ట్ర నాయకులు రహీం, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, శివ ముదిరాజ్ తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు భరోసా



ఎల్ఓసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదల వైద్యానికి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం గోల్నాకకు చెందిన లక్ష్మికి వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ పథకం క్రింద రూ. లక్ష మంజూరైన ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా కృషి చేసున్నట్లు పేర్కొన్నారు.

- నల్లకుంటకు చెందిన జె.ఎల్లయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం క్రింద మంజూరైన రూ.37,500ల చెక్కును కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ గోల్నాకలోని తన కార్యాలయంలో అందజేశారు. మంత్రి హరీష్‌రావు సహకారంతో ఈ చెక్కును మంజూరు చేయించామన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత



నోట్‌బుక్స్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: పేద విద్యార్థుల అభ్యున్నతికి తనవంతు చేయూతను అందిస్తానని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వాంబే కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తన సొంత ఖర్చులతో నోట్‌బుక్స్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... త్వరలో డివిజన్‌లో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను సమకూరుస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఆమె ఆకాంక్షించారు. బీజేపీ గ్రేటర్ మాజీ అధ్యక్షులు బి.వెంకట్‌రెడ్డి, నాయకులు చుక్క జగన్, పోడూరి సురేష్, రమేష్ ముదిరాజ్, గోవర్ధన్‌రెడ్డి, రమేష్, మిర్యాల శ్రీనివాస్, వెంకటేష్‌ముదిరాజ్ తదితరులున్నారు.

అధికారులు పారదర్శకంగా ఉండాలి

అంబర్‌పేట: పారిశుద్ధ్య నిర్వహణలో జీహెచ్ఎంసీ సిబ్బంది, అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మంగళవారం ఆమె కార్యాలయంలో పారిశుధ్య సిబ్బంది, అధికారులతో డివిజన్‌లోని పారిశుద్ధ్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బస్తీలోని బస్తీ కమిటీ పెద్దలు పారిశుద్ధ్యంపై అనేక ఫిర్యాదులు చేస్తున్నారని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపం కనిపిస్తుందని దీనిని సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు. పారిశుధ్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్

గురువులు నిత్య విద్యార్థులుగా ఉండాలి



బోధనలో మెలకువలపై జరిగిన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రవిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గురువులు నిత్య విద్యార్థులుగా ఉండాలని అప్పుడే చక్కగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించగలుగుతారని మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ డాక్టర్ పి.రవిరెడ్డి అన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిగ్రీ కళాశాలలో 'అవలీలగా బోధించడం ఎలా' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రవిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉదాహరణలతో బోధిస్తే సులువుగా అర్థమవుతుందన్నారు. నిరంతరం అధ్యాయనం తోనే విజ్ఞానం పెరుగుతుందన్నారు. బోధనలో కొత్తదనం కోసం ప్రతి అధ్యాపకుడు కృషి చేయాలన్నారు. కళాశాల డైరెక్టర్లు డాక్టర్ కె.రత్న, ఎస్.రిషికాంత్, ప్రిన్సిపాల్ ఎం.భవానీ, బోర్డు మెంబర్ రాఘవయ్యలతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

కూలిన ఇల్లు.. తప్పిన ప్రమాదం



బాధితులతో ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: భోలక్‌పూర్ హౌస్ వద్ద ఉన్న ఓ ఇల్లు కూలిపోయింది. కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వినయ్‌కి చెందిన ఇల్లు శిథిలావస్థకు చేరుకోవడంతో గత కొద్ది రోజులుగా ఇంటి గోడలు బీటలు వారి ప్రమాదకరంగా మారాయి. మంగళవారం మధ్యాహ్నం ఉన్న ఫలంగా ఇల్లు కుప్పకూలింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్, తహసీల్దార్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు రహీం, డివిజన్ యూత్ కమిటీ అధ్యక్షుడు సాయి, నాయకులు శివముదిరాజ్, మహేష్, అరీఫ్, అనిల్ తదితరులున్నారు.

కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్‌గా రాగి యెల్లప్ప

కాచిగూడ: కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్‌గా రాగి యెల్లప్ప నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయనను కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ.. రైల్వే పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2002 బ్యాచ్‌కు చెందిన యెల్లప్ప గతంలో పలు పోలీస్‌స్టేషన్‌లలో పనిచేసి ఉన్నతాధికారులతో మెప్పు పొందారు. ఆయన మాట్లాడుతూ.. రైల్వే ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేలా తన వంతు కృషి చేస్తానన్నారు.

కార్పొరేటర్ పర్యటన

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద నాలుగు నెలల క్రితం రోడ్డుపై మూడు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దీనిపై జీహెచ్ఎంసీ, నాలా ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సమస్యపై స్థానిక కార్పొరేటర్ అమృత దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆమె మంగళవారం ఆ ప్రాంతంలో పర్యటించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పరిశీలించారు. జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి గుంతలకు మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు.

నియామకం



డాక్టర్ ఆర్.వేదశ్రీ

కాచిగూడ: తెలంగాణ చేనేత ఐక్య వేదిక గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వేదశ్రీ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రాన్ని ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ చేనేత ఐక్య వేదిక ద్వారా కార్మికుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. డాక్టర్ వేదశ్రీకి పలువురు పద్మశాలీ సంఘం నేతలు అభినందనలు తెలిపారు.

ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కాచిగూడ: రాష్ట్రంలో 40 లక్షలకు పైగా ఉన్న ముదిరాజ్ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా వేయి కోట్లు కేటాయించాలని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు అంబటి చెన్నయ్య, పొట్లకాయల వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగం, ఆర్థిక, రాజకీయ రంగాల్లో తమ ప్రాతినిధ్యాన్ని పెంచేలా ప్రభుత్వం వెంటనే చట్టబద్ధమైన కమిషన్ వేయాలన్నారు. బీసీ రిజర్వేషన్లను పెంచాలని, జనాభా ప్రకారం తమ వాటా తమకు ఇవ్వాలన్నారు. నరేష్‌ముదిరాజ్, మంద శ్రీనివాస్, నీలం శ్రీనివాస్, సురేంద్ర, శ్రీకాంత్, సత్యం, గరిగంటి నరసింహ, వెంకట్‌రావు, దేవుడు శీను, పి.నరేష్ తదితరులున్నారు.

రిజర్వేషన్ల సమస్యలు పరిష్కరించాలి..

ముషీరాబాద్: ముదిరాజ్‌ల రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు శివముదిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో లక్ష పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు జరుగుతున్న అన్యాయాలపై ముదిరాజ్ చైతన్య వేదిక లక్ష పోస్టుకార్డుల ఉద్యమానికి తెరలేపిందన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు 15 ఎమ్మెల్యే టికెట్లతో పాటు రిజర్వేషన్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ మహిళా రాష్ట్ర నాయకురాలు పుష్పలత, రమేష్, కురుమూర్తి, నర్సింహ్మా, సీతామహాలక్ష్మి, సురేష్, వెంకటేష్, మహేష్, రాకేష్, జగదీష్, కార్తీక్ తదితరులున్నారు.

పద్మశాలీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: పద్మశాలీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. పద్మశాలీల సంక్షేమం, చేనేత వస్త్రాలపై పన్ను ఎత్తివేయడాన్ని అభినందిస్తూ ముషీరాబాద్ మహంకాళి దేవాలయ కమిటీ చైర్మన్ రాజు ఆధ్వర్యంలో మంగళవారం ముషీరాబాద్ శివాలయం చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు టి.సోమన్, నాయకులు శ్రావణ్, శివముదిరాజ్, ప్రవీణ్, భీమ్, మహేష్, పరశురాం యాదవ్ తదితరులున్నారు.

సమిష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి

కాచిగూడ: అధికారులు, ఉద్యోగుల సమిష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి సాధ్యమని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం (ఓ) డి.విజయభాను అన్నారు. మంగళవారం బర్కత్‌పుర డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విధి నిర్వహణలో కిలోమీటరుకు రూ.75 తీసుకొచ్చిన బర్కత్‌పుర డిపో కండక్టర్ సుమిత్రను ఈ సందర్భంగా ఆయన అభినందించి సత్కరించారు. డిపో మేనేజర్ ఎం.వేణుగోపాల్, శ్యామ్‌సుందర్, జయలక్ష్మి, యాదగిరి తదితరులున్నారు.



కండక్టర్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ ఆర్ఎం విజయభాను

ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోండి



ఆకాష్‌నగర్‌లో ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: ఓటరు జాబితాలో అర్హులైన వారు విధిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్ ఆకాష్‌నగర్‌లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు వేసే సమయంలో ఇబ్బందులు లేకుండా ముందుజాగ్రత్త చర్యగా వ్యవహరించాలన్నారు.

కాంగ్రెస్ మాజీ ఎంపీ ఎల్లయ్యకు ఘన నివాళి

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ, పేద ప్రజలకు మాజీ ఎంపీ నంది ఎల్లయ్య చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ ఎస్సీసెల్ జాతీయ చైర్మన్ రాజేష్ విలోతియా అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నంది శరత్ ఆధ్వర్యంలో మంగళవారం నంది ఎల్లయ్య 3వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేష్ విలోతియా ముఖ్యఅతిధిగా హాజరై నంది ఎల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ వి.హన్మంత్‌రావు, మల్లు రవి, హారిక, వేణుగోపాల్, ప్రీతం తదితరులున్నారు.

నేటి నుంచి బీజేపీ 'మేరీ మిట్టి.. మేరా దేశ్'



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.గౌతంరావు

కాచిగూడ: నేడు బీజేపీ నిర్వహించే 'నేను పుట్టిన నేలా.. నన్ను కన్న దేశం' కార్యక్రమం, 'మన మట్టికి నమస్సులు.. మన వీరులకు వందనం' (మేరీ మిట్టి.. మేరా దేశ్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు పిలుపునిచ్చారు. అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన వీరులను నిరంతరం గుర్తు చేసుకోవాలన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మనకు జన్మనిచ్చిన నేలా భారత్‌ను ఎల్లప్పుడూ స్మరిస్తూ ఉండాలన్నారు. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న సైనికులకు వందనం అన్నారు. బీజేపీ నేతలు పాపారావు, అట్లూరి సుభాషిణి, సత్యనారాయణ, కేశబోయిన శ్రీధర్, విజయ తులసి, జ్యోతి, రమేష్, బాబురావు, మహేష్, మహేందర్, రాజు, శ్రీనివాసులు తదితరులున్నారు.

బీజేపీలోకి చేరికలు



పార్టీలోకి ఆహ్వానించిన కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పలువురు ప్రభుత్వ, ప్రైవేట్, ప్రభుత్వ రంగ రిటైర్డ్ ఉద్యోగులు బీజేపీలో చేరుతున్నారని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ కమ్యూనిటీహాల్ వద్ద బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ ఆధ్వర్యంలో పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ రిటైర్డ్ ఉద్యోగులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రధాని దేశాభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి చేస్తున్న కృషిని తెలంగాణ రాష్ట్ర ప్రజలు హర్షిస్తున్నారని అభిప్రాయపడ్డారు. రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ నేతృత్వంలో, కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిల సారథ్యంలో ముషీరాబాద్ నియోజవర్గం ఎమ్మెల్యే సీటును భారీ మోజార్టీతో కైవసం చేసుకుంటామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. శ్రీకాంత్, రాజు, ప్రకాష్‌యాదవ్, సత్తిరెడ్డి, పి.నర్సింగ్‌రావు, సురేందర్, నవీన్‌కుమార్, సురేష్, సత్యంల సమక్షంలో పులువురు రిటైర్డ్ టీచర్లు కె.సంజీవ్‌రెడ్డి, వీఎస్టీ రిటైర్డ్ ఉద్యోగులు ఆర్. ముత్యంరెడ్డి, డి.శ్రీనివాస్‌కుమార్, నవభారత ఉద్యోగి పి.కృష్ణయ్య, యోగగురువు కె.శ్రీనివాస్, జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ ఎం.భాగ్యరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త జె.భాస్కర్, ఐటీ ఉద్యోగి తేజస్వీలతో పాటు పలువురు ఉద్యోగులు బీజేపీలో చేరారు.

నవోదయ ఎంట్రన్స్ టెస్ట్‌కు ఉచిత కోచింగ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే నవోదయ ఎంట్రన్స్‌కు హాజరయ్యే విద్యార్థులకు 'జటాధర ఎడ్యుకేషన్ టెక్నాలజీ సంస్థ' ఉచితంగా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. కేవలం రూ.200లతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఆగస్టు నుంచి జనవరి వరకు ఉచితంగా కోచింగ్ పొందవచ్చన్నారు. ఇప్పటికే రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు శిక్షణ పొందుతున్నారన్నారు. ఆగస్టు 10న నవోదయ ఎంట్రన్స్ దరఖాస్తుకు చివరి తేదీ అని పేర్కొన్నారు.

మంత్రి ఎర్రబెల్లి హామీని నిలబెట్టుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. గత 34 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల సాధనకు నిరవధిక సమ్మె చేస్తున్నారని అసెంబ్లీ సమావేశాల్లో శాసన సభ్యుల ఒత్తిడి మేరకు ఎట్టకేలకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జేఏసీ నాయకులతో చర్చలు జరిపారన్నారు. తమన్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుభూతితో ఉందని మంత్రి చెప్పడంతో తాత్కాలికంగా సమ్మెను విరమిస్తున్నామని ప్రకటించారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల డిమాండ్లల్లో ఆర్థికేతర డిమాండ్లు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాల పెంపు మల్టీపర్పస్ వర్కర్ విధానం, పర్మినెంట్ తదితర కీలక డిమాండ్లను సీఎంతో మాట్లాడి సానుకూలంగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రి హామీతో తమ సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే మరో పోరాటానికి గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకులు ఎండీ యూసుఫ్, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి కె.సూర్యం, టీజీకేబీయూ ప్రధాన కార్యదర్శి యజ్ఞనారాయణ్, సీఐటీయూ రాష్ట్ర కన్వీనర్ సీ.హెచ్.వెంకటయ్య, ఏఐటీయూసీ కన్వీనర్ వంకటరాజం, ఐఎఫ్‌టీయూ కన్వీనర్ శివబాబు, ఎస్.దాసు, పి.అరుణ్‌కుమార్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎస్.రమణ తదితరులున్నారు.